# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 88 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 20, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## యువత రాజకీయాల్లోకి రావాలి

**ఇదో ఉద్యమంలా సాగాలి.. అప్పుడే అవినీతి అంతం.. పరివార్‌వాదంతో దేశానికి ముప్పు: మోదీ**

**వారాణసిలో శంకర నేత్రాలయం ప్రారంభం**

**ఎన్‌డీఏ అంటే.. 'నరేంద్ర దామోదర్‌దాస్ కా అనుశాసన్': శంకరాచార్య**



**వారాణసి, అక్టోబరు 20,(నమస్తే ఉదయం):** దేశంలో కుటుంబ వారసత్వ రాజకీయాలు ఉండడం మంచిది కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అందువల్ల రాజకీయ నేపథ్యంలేని కుటుంబాలకు చెందిన యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. 'రాజకీయ వంశాలు' దేశ యువతకు నష్టం కలిగించాయని విమర్శించారు. ఆదివారం వారాణసిలో కంచిపీఠం నెలకొల్పిన ఆర్‌జే శంకర నేత్ర వైద్యశాలను ప్రారంభించడంతో పాటు, రూ.6,700 కోట్లతో చేపట్టిన వివిధ పనులకు మిగతా.. 2లో



## దాబాల్లో దర్జాగా సిట్టింగ్

**బహిరంగా ప్రదేశాలలో విచ్చలవిడిగా మద్యపానం**

**పోలీస్ చెక్ పోస్టు, ఎక్సైజ్ శాఖ చెక్ పోస్టు ఎదురుగానే మద్యం అమ్మకాలు**

**గద్వాల, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** దాబాల్లో లిక్కర్ తాగడంపై నిషేధం ఉన్నా జిల్లా పరిధిలోని పలు దాబాల్లో దర్జాగా సిట్టింగులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అయిజ, అలంపూర్ చౌరస్తా, రాజోలి, శాంతినగర్, ఇటిక్యాల, మానవపాడు, ఉండవెల్లి, ఎర్రవల్లి మండలాలో పరిధిలో దాబా హెూటళ్లల్లో మందుబాబుల విందులు నిత్యకృత్యం. దాబా యజమానులు ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక గదులను ఏర్పాటు చేయడమే కాకుండా అధిక ధరలకు మద్యం సరఫరా చేస్తున్నారు. గతంలో గుట్టుచప్పుడు కాకుండా సిట్టింగులు ఏర్పాటు చేసేవారు. కానీ ప్రస్తుతం పట్టపగలు, ఆరుబయట టేబుళ్లు వేసి మరీ మద్యం ఆగేందుకు అనుమతిస్తున్నారు. నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులు దాబా నిర్వాహకులు అందజేసే మామూళ్లకు అలవాటుపడి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలున్నాయి. మద్యం సేవించి వాహనాలను నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

### నందిన్నె చెక్ పోస్టులో మద్యం అమ్మకాలు

తెలంగాణ సరిహద్దులోని నందిన్నె చెక్ పోస్టులో గల దాబాలలో యధేచ్ఛగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దాబాలలోమద్యం అమ్మకాలకు అనుమతులు లేకుండా అధికారుల అండ దండలతో ఈ దందా కొనసాగుతోందని ఆరోపణలు. మద్యం అక్రమ రవాణ కోసం తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతం నందిన్నె వద్ద సివిల్, ఎక్సైజ్ శాఖ పోలీసులు ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఈచెక్ పోస్టు ఎదురుగానే ఉన్న దాబాలలో దర్జాగా మద్యం విక్రయాలు చేయడం విశేషం. అంతేకాకుండా చెక్ పోస్టు పరిసర ప్రాంతాలలో బహిరంగానే మందుబాబులు మద్యం సేవిస్తున్న అటు సివిల్ పోలీసులు కాని, ఇటు ఎక్సైజ్ శాఖ పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# నేటి నుంచి గ్రూప్-1

**27 వరకు యథాతథంగా మెయిన్స్**

**గ్రేటర్ పరిధిలో 46 పరీక్ష కేంద్రాలు**

**పరీక్షలు రాయనున్న 31,383 మంది**

**563 పోస్టుల భర్తీకి పరీక్షల నిర్వహణ**

**ప్రశ్నపత్ర వాహనాలకు తొలిసారి జీపీఎస్**

**నిఘా నీడలో అన్ని పరీక్షా కేంద్రాలు**

**మహిళలకు మంగళసూత్రం తప్ప ఆభరణాలు నిషిద్ధం**

**టీజీపీఎస్సీ అధికారుల వెల్లడి**




**హైదరాబాద్, అక్టోబర్ 20 (నమస్తే ఉదయం):** గ్రూప్- 1 మెయిన్స్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

563 పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే అన్ని పరీక్షా కేంద్రాలు (46) ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో 8, రంగారెడ్డిలో 11, మేడ్చల్ జిల్లాలో 27 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పరీక్ష హాల్‌లో అభ్యర్థులందరి బయోమెట్రిక్‌ను నమోదు చేస్తారు. కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రం తరలించే వాహనాలకు తొలిసారి జీపీఎస్ ఏర్పాటుచేస్తున్నారు. మెయిన్స్ పరీక్ష వాయిదా కోసం ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘట నలు జరుగకుండా కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతున్నారు.

అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేం దుకు టీజీపీఎస్సీ ప్రత్యేకంగా సిబ్బందిని నియమించింది. పరీక్ష గది, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితులను సమీక్షించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలలోపే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఆ తర్వాత అనుమతించబోమని అధికారులు తెలిపారు.

గ్రూప్-1 పరీక్ష చివరిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011లో జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉన్నత స్థాయి ఉద్యోగులను ఎంపికచేసే ఈ పరీక్ష మెయిన్స్‌ను నిర్వహిస్తుండటం ఇదే తొలిసారి.

### కట్టుదిట్టమైన భద్రత

గ్రూప్ మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని రాష్ట్రంలో తీవ్రమైన ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. రిజర్వేషన్లు, ప్రాథమిక పరీక్షలో తప్పులు తదితర అంశాలపై అభ్యర్థులు పోరాటం చేస్తున్నారు. కొందరు కోర్టుకు వెళ్లినప్పటికీ.. హైకోర్టు పరీక్ష నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో మెయిన్స్‌ను యథాతథంగా నిర్వహిస్తున్నారు.

ఆందోళనల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పశ్నపత్రాల తరలింపు, పరీక్ష నిర్వహణ, తిరిగి జవాబు పత్రాలు తీసుకెళ్లడం వరకు ఎలాంటి ఆటంకం లేకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద ఒక ఎస్ఐతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్ విధుల్లో ఉంటారు.

అదనంగా ఒక పోలీస్ ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను తరచూ సందర్శిస్తుంది. స్థానిక సీఐ, ఏసీపీ పరీక్షా కేంద్రాల ను సందర్శించి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తుంటారు. భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణకు మూడు కమిషనరేట్లలో ఒక్కో డీసీపీని నోడల్ అధికారిగా నియమించిన ట్లు పోలీసులు తెలిపారు.

ప్రశ్నపత్రాలు తరలించే వాహనాలకు టీజీపీఎస్సీ తొలిసారి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఉపయోగిస్తోంది. స్ట్రాంగ్ రూముల నుంచి పరీక్ష కేంద్రానికి తరలించే వాహనాలకు జీపీఎస్ అమర్చి టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారు. వాహనం ఒక్కనిమిషం ఆగినా వెంటనే గుర్తించి అప్రమత్తం చేస్తారు.

గ్రూప్ పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్‌నెట్ దుకాణాలు మూసివేయాలని పోలీసులు ఆదేశాలిచ్చారు. వాచీలు, కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, పెన్‌డ్రైవ్, బ్లూటూత్ తదితర ఎలాంటి స్మార్ట్ గాడ్జెట్స్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదు. మహిళలకు మంగళసూత్రం, గాజులు మినహా ఆభరణాలకు అనుమతి లేదు.

### చీమ చిటుక్కుమన్నా తెలిసిపోతుంది

ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుగా మారుతున్నది. చిన్న తప్పు జరిగినా క్షణాల్లో అది దావానంలా ప్రజల్లోకి వెళ్లిపోతుంది. అందుకే ఏవిధమైన అపోహలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

పరీక్షల నిర్వహణలో ప్రతి దశలోనూ కచ్చితమైన నియమ నిబంధనలు పాటించేలా అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేశారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా ఒక గంట సమాయాన్ని అదనంగా కేటాయిస్తున్నట్టు అధికారులు తెలిపారు. పరీక్ష రాయడానికి సహాయకులు (స్క్రైబ్ ) అవసరం ఉన్నవారి హాల్ టికెట్లపై ఆ విషయాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

వారికి స్క్రైబ్‌ల సహాయంతో పరీక్షలు రాసేందుకు ప్రత్యేకంగా 4 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్నిపరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. నిరంతరం విద్యుత్ సరఫరా అందించేలా ఎస్పీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. కాగా ఆదివారం నాటికి 90 శాతం అభ్యర్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం..

- ప్రపంచ నలుమూలలకు ప్రచారం
- ఎక్కడికెళ్లినా హైదరాబాద్ గురించి చెప్పండి
- త్యాగాలు చేయకుండా గొప్ప నాయకులం కాలేం
- ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** 'తెలంగాణను ప్రపంచం నలు మూలలకు తీసుకెళ్లేందుకు ఐఎస్‌బీ విద్యార్థులు సాయపడాలి. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దాలన్నదే మా లక్ష్యం' అని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఐఎస్‌బీ విద్యార్థులను తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా అభివర్ణించారు.

ఆదివారం గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో 'లీడర్‌షిప్ ఇన్ న్యూ ఇండియా' పేరుతో జరిగిన సమ్మిట్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజర య్యారు. పీజీ విద్యార్థుల కోసం ఐఎస్‌బీ ఏటా ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఈసారి నిర్వహించిన సదస్సును సీఎం ప్రారంభించి మాట్లాడారు.

కాంగ్రెస్‌కు గొప్ప నాయకత్వ వారసత్వముందని.. మహాత్మాగాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ వంటి నాయకులు అందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. గొప్ప నాయకులు కావాలంటే ధైర్యం చాలా ముఖ్యమని అన్నారు. కష్టపడే తత్వం, తెలివితేటలు, నైపుణ్యంతో పాటు కొన్నిసార్లు అదృష్టం కూడా ఉండాలని తెలిపారు.

గొప్ప నాయకులు కావాలనుకునేవారు త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని, పోరాటంలో చాలా కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. దేశంలో గొప్ప నాయకులు ప్రజల కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేశారని గుర్తుచేశారు. విద్యార్థులు చదవుతో పాటు రాజకీయాల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు.

### ట్రిలియన్ డాలర్లకు పెంచుతాం

తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే హైదరాబాద్ 600 బిలియన్ డాలర్ల నగరంగా అభివృద్ధి చెందాలని చెప్పారు. ఇందుకోసం ఐఎస్‌బీ విద్యార్థులు తమకు సాయంగా నిలబడాలని కోరారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలంగాణ, హైదరాబాద్ గురించి మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్, భారత్‌లోని ఇతర నగరాలతో పోటీ పడాలని అనుకోవడం లేదని, న్యూయార్క్, పారిస్, టోక్యో వంటి సిటీలను ఆదర్శంగా తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

### ఒలింపిక్స్‌లో పథకమే లక్ష్యం

రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. దానికి అనుసంధానమైన క్రీడా యూనివర్సిటీని గచ్చిబౌలిలోనే ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దక్షిణ కొరియా లాంటి చిన్న దేశం ఒలింపిక్స్‌లో పతకాలను సాధిస్తూ సత్తా చాటుతోందని, భారత్ ఒలింపిక్స్ పతకాలు సాధించడంలో వెనకపడిందని అన్నారు. ఒలింపిక్స్‌లో పథకాలు సాధించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. దేశానికి హైదరాబాద్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని తెలిపారు.

### మాతో కలిసి పనిచేయండి

తమ సర్కారుతో కలిసి రెండుమూడేళ్లు పని చేయాలని ఐఎస్‌బీ విద్యార్థులకు సీఎం సూచించారు. ఈ పనిచేసే సమయంలో తమ ప్రభుత్వం భారీగా వేతనాలు ఇవ్వకపోయినా.. గట్టి సవాళ్లను ఇస్తామని




పేర్కొన్నారు. ఐఎస్‌బీలో చదువుతున్న వారంతా చాలా తెలివైన వారని కొనియాడారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి ఐఎస్‌బీ ప్రాంగణంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌదరి (రిటైర్డ్), మాజీ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ డాక్టర్ షమిక రవి, ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యుడు సురేష్ నారాయణన్ తదిదరులు పాల్గొన్నారు.

## గవర్నర్ దత్తాత్రేయకు తప్పిన పెనుప్రమాదం?

### ప్రమాదంలో దెబ్బతిన్న ఎస్కార్ట్ వాహనం

**శంషాబాద్ రూరల్, అక్టోబరు 17,(నమస్తే ఉదయం):** హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు పెనుప్రమాదం తప్పింది. రంగారెడ్డి జిల్లా ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ సీఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఢిల్లీ వెళ్లేందుకు దత్తాత్రేయ ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరారు.

ఎయిర్‌పోర్టు ప్రధానరోడ్డుపై సడెన్ బ్రేక్ వేయడంతో కాన్వాయ్‌లోని వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అప్పటికే గవర్నర్ కూర్చున్న వాహనం ముందుకు వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. గవర్నర్ వాహనానికి ఎలాంటి ప్రమాదం జరగలేదని, తర్వాత ఆయన ఢిల్లీకి బయల్దేరి వెళ్లారని పోలీసులు తెలిపారు.




ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శృతి మించుతున్న ప్రయాణాలు

### ఆటోలలో పరిమితికి మించి కూలీల ప్రయాణం

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు, ఆటోలు, ఇతర వాహనాల రిజిస్ట్రేషన్ సందర్భంగా రవాణా శాఖ అధికారులు విధించే నిబంధనలు ఇవే. కానీ ఇవి రాతలకు మాత్రమే. ప్రైవేటు వాహనదారులు లాభాపేక్షతో ఇష్టారాజ్యంగా ప్రయాణికులను ఎక్కిస్తుంటారు. పరిమితికి మించి ప్రయాణికులతో పాటు మితిమీరిన వేగం.. ఇలా గద్వాల, అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు, కూలీలు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. గద్వాల నియోజకవర్గంలోని పరిసర ప్రాంతాల నుంచి మిరప కూలీలు మల్దకల్, గద్వాల ప్రాంతం వైపు కూలిపని కోసం ప్రయాణం చేస్తుంటారు. ప్రమాదమని తెలిసినప్పటికీ కిక్కిరిసిన ఆటోలలోనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రైవేటు వాహనదారులు నిబంధనలకు నీళ్లొదిలి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలను నడుపుతున్నారు. ఫలితంగా అనేక ప్రమాదాలు జరిగాయి.. జరుగుతూనే ఉన్నాయి. ఈ కారణంగా ఎంతో మంది వికలాంగులయ్యారు. మరికొందరు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. కూలికి వెళ్లిన వ్యక్తులు క్షేమంగా ఇంటికి చేరే వరకు ఆయా కుటుంబాల్లో ఆందోళనకరమే.

కష్టజీవుల ప్రాణాలతో చెలగాటమాడే వారిపై చర్యలు తీసుకునేవారు కరువవడంతో ఆటోవాళ్లదే ఇష్టారాజ్యంగా మారింది. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే ఉద్దేశంతో ఆటో డ్రైవర్లు పరిమితికి మించిన ప్రయాణికులతో మితిమీరిన వేగంతో తీసుకెళుతున్నారు. నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో, రహదారులపై మలుపుల్లో బోర్లా పడటం, ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ప్రమాదాలు జరగడం, అక్కడికక్కడే సర్దుబాటు చేసుకుని వెళుతుండటం సర్వసాధారణమైంది.

అంతేకాక ఆటోలకు సరైన పత్రాలు లేకపోవడం, డ్రైవర్లకు లైసెన్సులు లేకపోవడంతో ప్రమాదాలకు గురైన వారికి బీమా కూడా అందటం లేదు. దీనికి తోడు కొంతమంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

మరికొంత మంది చిన్నవయస్సులోనే అవగాహన లేకుండా తెలిసీ, తెలియని డ్రైవింగ్ చేస్తూ, మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వాహనాల రాకపోకలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పరిమితి మించి ప్రయాణికులతో వెళుతున్న ఆటో

# ప్రతి వ్యక్తికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందేలా కృషి చేయాలి

## - నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి



సమావేశంలో మాట్లాడుతున్న నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి వ్యక్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలుచేసి, ప్రతి వ్యక్తిని ఆర్థికంగా అభివృద్ధి పరిచాలన్నదే తన లక్ష్యమని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. ఆదివారం నాగర్ కర్నూల్ కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, స్థానిక శాసనసభ్యులు కూచుకుల్ల రాజేష్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, నాగర్ కర్నూలు జిల్లా అదనపు కలెక్టర్లు సీతారామారావు దేవ సహాయం , గద్వాల అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల అధికారులు, బ్యాంక్ అధికారులతో ఈనెల 22వ తేదీన నాగర్ కర్నూల్ పట్టణంలో చేపట్టనున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అవగాహన సదస్సుపై నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక రకాల పథకాలను ప్రజలకు నిరుద్యోగ యువతీ యువకులకు అందే విధంగా జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు తెలియజేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాన్ని ఈనెల 22వ తేదీన నాగర్ కర్నూలు పట్టణంలోని తేజా కన్వెన్షన్ హాల్ నందు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ మరియు ఎం ఎస్ ఎం ఈ,వివిధ బ్యాంకులకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొంటారని, ప్రభుత్వాలు అందించే పలు పథకాల కు సంబంధించిన రుణాల మంజూరి, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు లాంటి విషయాలను వివరిస్తారని తెలియజేశారు. నాగర్ కర్నూల్ లో నిర్వహించే అవగాహన సదస్సు ఒక మోడల్ సదస్సుల ఉంటుందని ఎంపీ తెలిపారు.

ప్రజలు తమకు అనుకూలమైన రుణాలను పొందడంతోపాటు అవసరమైన వారికి రుణాల మంజూరుతో పాటు బ్యాంకుల గ్యారెంటీని అందించేలా కార్యక్రమం ఉంటుందని ఎంపీ తెలిపారు. ముఖ్యంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని యువతి యువకులు వ్యాపారవేత్తలుగా మారే అవకాశాలను తెలియజేస్తారని సూచించారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం లోని వివిధ శాఖలకు చెందిన ఉన్నత అధికారులు ఈ అంశాలను తమ శాఖ పరిధిలోని అధికారులకు తెలియజేసి ఆయా శాఖల యందు తమ పేర్లు నమోదు చేసుకున్న వారందరినీ అవగాహన సదస్సు కు హాజరయ్యేలా చూడాలని తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అన్ని రకాల పథకాలు ప్రజలకు వివరించాలని అధికారులు, బ్యాంకు అధికారులకు ఎంపీ సూచించారు. బ్యాంకులు అందించే రుణ సదుపాయం, సబ్సిడీ లాంటి అంశాలు నిరుద్యోగ యువతీ యువకులకు తెలుపాలని కోరారు. అదేవిధంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో మరిన్ని ప్రాంతాల్లో కెనరా బ్యాంకు సేవలందించాలని అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రతి వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాల ద్వారా రుణాలు అందించే విధంగా బ్యాంకర్లు సిద్ధంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడుకు చెందిందిన నియోజకవర్గమని ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజల ఆర్థిక అభ్యున్నతికి బ్యాంకర్లు కృషి చేయాలన్నారు.

అదేవిధంగా ప్రతి వ్యక్తికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రుణాల గురించి తెలియాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

సిఎస్ఆర్ నిధులతో విద్యా వైద్యానికి ఖర్చు చేసి మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతోనే నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఎస్సీ, ఎస్టీ, బిసి గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలలో మూత్రశాలలు అవసరమైన త్రాగునీరు విద్యుత్తు ఫ్యాన్లు మౌలిక వసతుల ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్య వైద్యానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ,

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి వ్యక్తికి అందాలనే ఉద్దేశంతోనే నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు నాగర్ కర్నూల్ పట్టణంలో పెద్ద స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించడం చాలా సంతోష నియమని కలెక్టర్ తెలిపారు.

నాగర్ కర్నూల్ పట్టణంలోని తేజ కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్వయం ఉపాధి సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అన్ని రకాల ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ తెలిసేలా,

వివిధ బ్యాంకులు అందించే రుణాలు, సబ్సిడీలు నిరుద్యోగ యువతీ యువకులకు తెలిసేలా అవగాహన ఈ సదస్సు ద్వారా కల్పించ నున్నట్లు తెలిపారు.

జిల్లా అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఈ నెల 22వ తేదీన జరగబోయే స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు విజయవంతం అయ్యేటట్లు చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు నిరుద్యోగ యువతీ యువకులకు తెలియజేసే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రతి డిపార్ట్మెంట్ అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, ప్రయోజనాలు తెలియజేసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ అవగాహన సదస్సుకు వివిధ బ్యాంకులు అందిస్తున్న రుణ సదుపాయం లాంటి విషయాలు తెలియజేసేలా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయని, చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు తెలియజేయాలన్నారు.

నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని యువతీ యువకులకు ఐటిఐ, డిప్లమా కోర్సుల తదనంతరం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు అందిస్తున్న అన్ని రకాల ప్రభుత్వ పథకాలను ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తామని సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిచే అవగాహన కలిగించే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలియజేశారు.

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో జరగనున్న అవగాహన సదస్సుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరవుతారని, ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా అధికారులు చూడాలన్నారు. అన్ని వర్గాల యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలియజేశారు. డిగ్రీ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడటానికి ఒక మైలురాయిగా ఈ అవగాహన సదస్సు నిలుస్తుందని ఎమ్మెల్యే చెప్పారు.

అందుకు పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి యువకుడు పాల్గొనేలా అధికారులు చూడాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జోనల్ అధికారి శ్రీనివాస్, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ అవార్డు ఎన్జీవో అధ్యక్షుడు వెంకట్, నాగర్ కర్నూల్ డి ఆర్ డి ఏ చిన్న ఓబులేసు, డీఈవో గోవిందరాజులు, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నజీమ్ అలీ, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి రామ్ లాల్ , ,డి ఆర్ డి ఓ ,ఉమాదేవి, ఎల్ డి ఎం శ్రీనివాసులు, కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్ కోఆర్డినేటర్ పి శ్రీనివాస్, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ ఎస్టీ ఎంటర్ప్రైజెస్ ప్రెసిడెంట్ నల్లబాబు, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖల ఆర్ సి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.



## రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన టిఆర్ఎస్ నాయకులు

**గద్వాల(కేటిదొడ్డి) అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ చర్యకు నిరసనగా ఆదివారం కేటిదొడ్డి మండల కేంద్రంలో బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు బంధుకు రాం రాం చెబుతుందని ఎన్నికలకు ముందే కేసీఆర్ చెప్పిన మాటలను రేవంత్‌రెడ్డి సరార్ అక్షరాల నిజం చేసిందని తెలిపారు. వానాకాలం రైతు భరోసాను ఎగ్గొట్టి రైతుల నోట్లో రేవంత్ రెడ్డి మట్టి కొట్టాడని మండిపడ్డారు.వానాకాలం రైతు భరోసా ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వాల్సిందేనని.. లేదంటే కాంగ్రెస్ నాయకులను ఎకడికకడ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కరవి, కృష్ణ, రవి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## బొలెరో, బైక్ ఢీ... ఒక్కరు మృతి

**కేటిదొడ్డి, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** ధరూర్ మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామ శివారులో బొలెరో వాహనాన్ని బైక్ బలంగా ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. కేటి దొడ్డి మండలం ఇర్కిచేడుతండా గ్రామానికి చెందిన రవీందర్ నాయక్ (23) ఆదివారం కొత్తపాలెం వద్ద పొలం పనులకు వెళ్లాడు. పని మీద కోతులగిద్ద స్టేజ్ కు వెళ్లి తిరిగి కొత్తపాలెంకు బైక్ పై వెళ్లుతుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని బైకు ఢీకొట్టింది. దీంతో రవీందర్ నాయక్ సంఘటన స్థలంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధరూర్ ఎస్సై అబ్దుల్ షకూర్ తెలిపారు.



## అ'పూర్వ' సమ్మేళనం...వెల్లివిరిసిన ఆనందం...

### ఘనంగా ఎల్లకొండ 2001-02 టెన్త్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం...

### విద్యార్థుల ఉన్నతే గురువులకు ఆనందం...

### పూర్వ విద్యార్థులకు సూచించిన ఆనాటి ఉపాధ్యాయులు...



**మొయినాబాద్ అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** ఎక్కడో పుట్టి..ఎక్కడో పెరిగి చిన్ననాటి నుండి ఒకే విద్య సంస్థలో చదివిన పూర్వ విద్యార్థులు 22 సంవత్సరాల తర్వాత ఆత్మీయ వేదికపై కలుసుకున్నారు.ఈ సందర్భంగా గురువారం చేవెళ్ల గ్రామ సమీపంలో గల త్రిపుర రిసార్ట్ లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎల్లకొండ ఉన్నత పాఠశాలలో 2001-02 జ్ఞాపకాలను అప్పటి టెన్త్ క్లాస్‌లో వీరు చేసిన అల్లరి చేష్టలను,ఉపాధ్యాయులతో కలసి, అప్పటి ఆట, పాటలను వారు గుర్తు చేసుకుంటూ ఆనందోత్సవాలతో గడిపారు.ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకరితో ఒకరు చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు ఆలింగనం చేసుకుంటూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు మేళ, తాళాలు,చప్పుళ్లతో సాంప్రదాయ పద్ధతిలో సభా స్థలానికి ఆహ్వానించి ఉపాధ్యాయులకు పుష్ప గుచ్చాలు అందజేస్తూ వేదిక పైకి పిలిచి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమాని ఉద్దేశించి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నైతిక విలువలు,సమాజ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. తమ పిల్లల చదువుపై ఒత్తిడి చేపట్టవద్దని అభిప్రాయం మేరకే ముందుకు సాగితే విజయం తథ్యమని చెప్పారు. వివిధ స్థాయిల్లో అందరూ పని చేస్తున్నప్పటికీ 22 సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకోవడం శుభపరిణామం అని అన్నారు. విద్యార్థులందరూ ఒక చారిటీని ఏర్పాటు చేసు కొని సమాజసేవగా సహాయం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు రమణకుమారి, అంజయ్య, హిమామ్,రామకృష్ణారెడ్డి,రాజు,ప్రతాప్,మనోహర్,బాల కుమార్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, ఆనాటి పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## హమాలీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

### - ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** హమాలీ బ్రతుకులు చాలా దుర్భరమైనవి వీరిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు అయిందని ఆరోపించారు. ఆదివారం ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హమాలి కార్మికుల జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో కే రామస్వామి అధ్యక్షతన ఈ



సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో 20 లక్షలకు పైన హమాలీ కార్మికులు పనిచేస్తున్నారని సంఘటిత రంగం మరియు అసంఘటిత రంగంలో వీరు పని చేస్తున్నారని వీరికి ఎలాంటి భద్రత లేదని ఆయన ఆవేదన చెందారు. హమాలీ కార్మికుల తో ప్రభుత్వాలు శ్రమ చేయించుకుని ఆర్థిక దోపిడీ చేస్తున్నాయని ఆయన విమర్శించారు

అమాలి బ్రతుకులు బాగుపడాలి అంటే సంఘం పెట్టుకొని పోరాడాలి అని ఆయన అన్నారు కమ్యూనిస్టులు లేకపోతే ఏఐటీయూసీ సంఘం లేకపోతే అమాలి కార్మికుల బ్రతుకులు మరింత అధ్వానంగా ఉండేవని ఆయన అన్నారు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని మండిపడ్డారు

జిల్లావ్యాప్తంగా హమాలీలు అందరూ ఒక్కటిగా ఉండి హక్కుల కోసం నిలబడి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడి అనంతరం హమాలి సంఘం నూతన కమిటీని ప్రకటించారు. నూతన కమిటీకి ప్రధాన కార్యదర్శిగా కె రామస్వామి జిల్లా అధ్యక్షులుగా యాదయ్య కార్యనిర్వాహక అధ్యక్షునిగా రాజు ఉప ప్రధాన కార్యదర్శిగా కృష్ణ వీరితో పాటు 21 మంది తో నూతన కమిటీని పానుగంటి పర్వతాలు ప్రకటించారు

ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి వడ్ల సత్యనారాయణ జిల్లా కార్యవర్గ సభ్యులు సక్రు నాయక్ స్వామి అమాలి కార్మికులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఎస్,జి,ఎఫ్,ఐకి కొత్తకోట విద్యార్థుల ఎంపిక

### అభినందించిన ఎస్ జి ఎఫ్ ఐ సెక్రటరీ శారదా భాయ్

**కొత్తకోట, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎస్ జి ఎఫ్ ఐ కరాటే సెలక్షన్ పోటీలు శనివారం మహబూబ్ నగర్ మినీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన 200, మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 14,అండర్ 17, విభాగాలలో విద్యార్థులకు ఎంపిక జరిగిందని



దీనిలో వనపర్తి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ మన కొత్త కోట పట్టణానికి చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే ఆకాడమీకి చెందిన విద్యార్థులు వీరిలో హర్షవర్ధన్, అండర్ 14 ఇయర్స్ ఎండి అబ్దుల్ రెహమాన్,అండర్ 17 విభాగాలలో, నవంబర్ 2 తేదీన సంగారెడ్డిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎస్,జి,ఎఫ్,ఐకి ఎంపికయ్యారని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబి తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉమ్మడి జిల్లా మహబూబ్నగర్ సీనియర్ కరాటే మాస్టర్స్ జహంగీర్ పాషా ఖాద్రి, కృష్ణయ్య, తాజుద్దీన్, శంకర్ నాయక్, రవి నాయక్, ఇలియాస్,విజయ్ కుమార్, రాము, గోపాల్,శేఖర్, శ్రీనివాసులు, క్లబ్ సీనియర్ కరాటే మాస్టర్స్ ఎంఎ ఇఫ్తార్, జఫర్,సాదిక్,జి హరీష్ యాదవ్, ఇంతియాజ్, పరమేష్, శివరాజ్, కురుమూర్తి యాదవ్, మంజునాథ్, జాంగిర్,జె.సుమ,లు విద్యార్థులను అభినందించారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

శంకుస్థాపన చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. “పరివార్‌వాదులతో దేశానికి పెద్ద ముప్పు ఉంది. యువతకు అవకాశాలు ఇవ్వడంలో వారికి నమ్మకం లేదు. అందువల్లనే రాజకీయ నేపథ్యంలేని కుటుంబాలకు చెందిన లక్ష మంది యువత రాజకీయాల్లో పాల్గొనాలని ఎర్రకోట నుంచి పిలుపునిచ్చాను. దేశ రాజకీయాలను మార్చేందుకు, అవినీతిని, పరివార్‌వాద సిద్ధాంతాన్ని నిర్మూలించేందుకు దీన్ని ఉద్యమంలా చేపట్టాలి” అని అన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఆశ్రిత పక్షపాతాన్ని పోషిస్తున్నాయని విమర్శించారు. గతంలో వేల కోట్ల రూపాయల కుంభకోణాలు పత్రికల్లో పతాక శీర్షికలుగా ఉండేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు.

## హిందువులపై అన్యమతాల కొమ్ముకాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**కొత్తకోట, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** హిందువులపై అన్యమతాల కు కాంగ్రెస్ ప్రభుత్వం కొమ్ము కాస్తూ ఉందని హైందవ నాయకులు ఆరోపించారు. ఆదివారం సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన విద్వేష ముష్కర దాడినీ నిరసిస్తూ హిందూ సంఘాల నాయకులు శాంతియుతంగా ర్యాలీ నిరసన తెలియజేస్తుండగా ఆకస్మికంగా హిందూ సోదర సోదరీమణులపై పోలీసులు అమానుష దాడి లాఠీ ఛార్జ్ చేసి గాయపరిచారు. నిందితున్ని ఏం చేయలేక పోలీసులు శాంతి నిరసన తెలియజేస్తున్న హిందువులపై అన్యమతాల కొమ్ము కాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ తో లాఠీల దాడి చేయడం ఎంతవరకు న్యాయం.

దీనిపై ఈరోజు కొత్తకోట పట్టణ కేంద్రంలో హిందూవాహిని మరియు హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది..




హిందూ దేవాలయాలపై దాడులను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న హైందవ నాయకులు

హిందువులు ఎంతో పవిత్రంగా పూజించే ఈ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భాగ్యనగర్ లోని పలు చోట్ల వరుసగా ఆలయాల్లో ఉన్న విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు.

మత సామరస్యానికి దెబ్బ తీయడానికి ఈ కుట్ర పన్నారు అంతే కాదు సంతోష్ నగర్ లోని రక్షపురం లో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు, ఉత్సవాల్లో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన దుర్గ మత విగ్రహాన్ని కూడా ధ్వంసం చేశారు , సికింద్రాబాద్ లోని కుమ్మరి గూడ ముత్యలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేశారు .ఇవన్నీ చేసింది మరో మతానికి చెందిన వారు వీళ్ళందరినీ అరెస్టు చేసి శిక్ష వేయక మతిస్థిమితం లేదు అని కేసు ను నిర్వీర్యం చేస్తున్నారు.హిందువుల సహనాన్ని పరీక్షిస్తే చూస్తూ ఊరుకునేది లేదని నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్రం లో దేవాలయ పై జరుగుతున్న దాడులను చూస్తుంటే ఏదో కుట్ర జరుగుతుంది.దాన్ని నిఘా సంస్థలు ఈ కుట్రల వెనకాల ఏ శక్తి ఉన్నదో అని వెంటనే గుర్తించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హిందు వాహిని జిల్లా నాయకులు శ్రీకాంత్ యాదవ్. ప్రహ్లాద్ నవీన్ కుమార్ .రాఘవేంద్ర రెడ్డి . అంజి. శ్రీశైలం యాదవ,హిందూ వాహిని పట్టణ నాయకులు. రాజు యాదవ్ మనోజ్ కుమార్. గౌతమ్ రెడ్డి. రాఘవేందర్ రెడ్డి. శివ ప్రసాద్ .తరుణ్ . మన్నెపు రెడ్డి . జగదీష్ యాదవ్, రవి కుమార్ హరి కుమార్, రాఘవేంద్ర గౌడ్ ,.సాయి, శివ సాయి ,రవి కుమార్

శ్రీకాంత్ కిట్టు, అయ్యప్ప సేవా సమితి గోపి స్వామి, నాగరాజు , అశోక్ రాజు, మాధవ రెడ్డి ,

అమరేందర్ రెడ్డి చీర నరసింహ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుబంధు పేరుతో పందేళ్లు రాష్ట్రాన్ని లూటీ చేసిన టిఆర్ఎస్

## కాంగ్రెస్ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి

### రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి

**కొత్తకోట, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** గత పదేళ్ల రైతుబంధు పేరుతో ప్రభుత్వం అన్నదాతలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం కొత్తకోట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...

గత పది సంవత్సరాలు కేసీఆర్ ప్రభుత్వ హాయంలో చిన్న సన్న కారు రైతులకు అందవలసిన పంట పెట్టుబడిని వారి హాయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు ఎంపీపీలు జెడ్పిటిసిలు ఒక్కొక్కరు బీడు పడ్డ వందల ఎకరాల భూములకు రియల్ ఎస్టేట్ భూములకు లక్షల రూపాయలు ఖాతాలో వేసుకొని పేద రైతులకు మోసం చేసిందన్నారు. పదేండ్లు రాష్ట్రాన్ని రైతుబంధు పేరుతో దోచుకొని లూటీ చేసి ఇవాళ ధర్నాలు నిరసనలు చేయడం సిగ్గుచేటుగా ఉందని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు ఎన్నికల ముందు బూటకపు మాటలతో లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని చెప్పి పది సంవత్సరాలైనా రుణమాఫీ చేయలేక చేతులెత్తేసి వాయిదాల మాఫీ చేసి వడ్డీలకు వడ్డీలు కట్టి రైతుల నడ్డి విరిసిన మీరు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది రైతుల ఆగ్రహానికి గురి అయిన మీరు ఈరోజు తగదు నమ్మని నిరసనలు చేసినంత మాత్రాన రైతులు నమ్మడానికి సిద్ధంగా లేరు అని గుర్తించాలి.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిజమైన పంట వేసిన రైతుకే సాగు చేస్తున్న భూములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కోసం జాప్యం జరుగుతుంది తప్ప రైతుబంధు పేరుతో బురద జల్లి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తే అది సాధ్యం కాదు నిజమైన రైతులకు రైతు భరోసా ఇవ్వడానికి ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తుందని తెలియజేస్తున్నాను.

గత 10 ఏండ్లు అకాల వర్షాలకు పంట నష్టపోతే పంటల బీమా ఒక్క రూపాయి కూడా రైతులకు ఇవ్వని దుర్మార్గులు బీఆర్ఎస్ నాయకులు అధికారం పోయిందని ప్రతిపక్ష పార్టీ నేతలు సోయ లేకుండా మాట్లాడుతూ రైతులకు వచ్చే రాయితీలును అన్ని రద్దుచేసి పదేళ్లపాటు రైతుల గురించి మాట్లాడని వారు ఇవాళ రైతుల జపం చేస్తున్నారు అసలు బీఆర్ఎస్ నాయకులకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు వారి చిల్లర రాజకీయాలు మానుకోవాలని తెలియజేస్తున్నాను.

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఖరీఫ్ నుంచే రైతులు సాగుచేసిన సన్న రకం దాన్యం కు 500 బోనస్ అమలు చేయడం. ఈ ఖరీఫ్ సీజన్ నుండే ప్రతి రైతు పంటకు పంటల బీమా పథకం ప్రభుత్వమే ప్రీమియం చెల్లించడం.

ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా డిసెంబర్ 9 కల్లా సంకేదిక కారణాల వలన తప్పిదాల వల్ల రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ అవుతుందని తెలియజేస్తున్నాను.

రైతులకు రైతుబంధు పేరు చెప్పి రైతులకు వచ్చే రాయితీలను అన్ని రద్దు చేసి అన్ని రోగాలకు జింద దిలిస్మాత్ మాదిరిగా రైతులను ఇబ్బందులు పెట్టి ఈరోజు సోయి ధ్యాస లేకుండా ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టాలని విచిత్రమైన కలలుగంటున్నారని తెలియజేస్తున్నాను. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జెసిపి రాములు సాగర్, రాములు యాదవ్ పాల్గొన్నారు.

# డాక్టర్ నిషికా మాదిరెడ్డి నృత్యం అద్వితీయం

## ఆలరింపజేసిన నృత్య ప్రదర్శన

### నిషిక మాదిరెడ్డికి సర్టిఫికెట్ ప్రధానం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏపీ జితేందర్ రెడ్డి

**రవీంద్ర భారతి, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** లయబద్ధమైన నాట్యాంశాలకు వైవిధ్యభరితంగా వర్తిం చిన యువ నర్తకి డాక్టర్ నిషిక మాదిరెడ్డి నాట్యం రసర మ్యంగా సాగింది. ఆదివారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డి, చిత్ర నిర్మాత దిల్ రాజ్ లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన భారతీయ శాస్త్రీయ నృత్య కళాకారిణి, విధ్వాన్సురాలు, డాక్టర్ రాజేశ్వరి సాయినాథ్ శిక్షణలో భరత నాట్యం నేర్చుకున్న డాక్టర్ నిషిక మాదిరెడ్డి నృత్య ప్రదర్శన రవీంద్ర భారతిలో ఆహుతులను అలరింపజేసింది. డాక్టర్ నిషిక మాదిరెడ్డి చక్కటి ఆహార్యంతో ఆకట్టుకునే హావ భావాలతో నర్తకి డాక్టర్ నిషిక ఆహుతులను సమ్మోహనపరిచింది. తొలి బహిరంగ ప్రదర్శనలోనే అనుభవపూరిత అడుగులు వేస్తూ సాగిన నిషిక నాట్యం ప్రేక్షకుల్ని రంజింపజేసింది. నాట్య గురువు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన భారతీయ శాస్త్రీయ నృత్య కళాకారిణి, విధ్వాన్సురాలు, డాక్టర్ రాజేశ్వరి సాయినాథ్ నర్తకి డాక్టర్ మిషిన్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సంద ర్భంగా నాట్య గురువు డాక్టర్ రాజేశ్వరి సాయినాథ్ కి గురుసత్కారం చేశారు. ఈ సందర్భంగా నాట్య గురువు డాక్టర్ రాజేశ్వరి సాయినాథ్ మాట్లాడుతూ... కలల పట్ల ఆసక్తి ఉన్న కళాకారులకు సంతృప్తి, ఆనందం, లక్ష్యసాధన ఉంటుందన్నారు. ఏ రంగంలో ఉన్న వారైనప్పటికీ ఏదో ఒక కల పట్ల ఆసక్తి ఉంటుందన్నారు. డాక్టర్ నిషిక మాదిరెడ్డి తన వైద్య వృత్తిలో ఎంతో బిజీ ఉన్నప్పటికీ భరతనాట్యం పట్ల ఆసక్తితో 33 ఏళ్ల వయసులో నృత్య కళపట్ల క్రమశిక్షణ పట్టుదలతో శిక్షణ పూర్తి చేసుకుని నృత్య ప్రదర్శన చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, డాక్టర్ నిషిక తండ్రి మాదిరెడ్డి జలంధర్ రెడ్డి,సీనియర్ నాయకులు మూలమల్ల భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూసీకి అడ్డుపడితే కేసిఆర్, కేటీఆర్, హరీష్‌రావు ఫాంహౌజులను ముట్టడిస్తాం...

## తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ నాయకుడు గొల్ల జాన్...



**కూకట్‌పల్లి,అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** మూసీకీ అడ్డుపడితే మరో పోరాటం తప్పదని తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నల్గొండ అంటే పోరాటాల గడ్డ అని రెచ్చగొడితే రెచ్చిపోరని అన్నారు. మూసీకి అడ్డుపడితే కేసిఆర్, కేటీఆర్, హరీష్ రావు ఫాంహౌజులను ముట్టడిస్తామని హెచ్చరించారు.

మూసీ నీళ్లతో క్యాన్సర్, గుండె, కిడ్నీ, కాలేయం, ఊపిరి తిత్తుల, అలెర్జీ వంటి తీవ్రమైన జబ్బులు వస్తున్నాయని అన్నారు. పదేండ్ల కింద్ర కూలిపోయిన కాళేశ్వరం డీపీఆర్ కు 33 కోట్లు చెల్లించారు ఇప్పుడు మాపై గగ్గోలు చేస్తున్నారు. మూసీ డీపిఆర్ చేసిన మెయిన్ హార్ట్ టీ కంపెనీపై కేటీఆర్ వి అసత్య ఆరోపణలుచేస్తున్నారు. కాళేశ్వరం డీపీఆర్ చేసిన వ్యాప్కోస్ ను ఒరిస్సా, గుజరాత్ బ్లాక్ లిస్ట్ లో పెట్టాయని, కేటీఆర్ స్నేహితుని కంపెనీ గ్లోబరీనాతో పదుల సంఖ్యలో విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయని అన్నారు. పదేండ్లు ఎస్సెల్బీసీ సొరంగం పడావుపెట్టి నల్గొండను నాశనం చేసిన కేసిఆర్ కదా అని, ఎస్సెల్బీసీ బేరింగ్ కోసం సీఎం, అమెరికాకు పోయి రాబిన్స్ టన్నెల్ సీఈఓ లాక్ హంను కలిసామని అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరంలో లక్షల కోట్లు దోచుకుతున్నారు.

డబ్బుందనే అహంకారంతో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై రెచ్చిపోయి మాట్లాడుతున్న కేటీఆర్

స్పెల్లింగులు వచ్చా అంటూ మిడిసిపడుతున్న కేటీఆర్ కు సంస్కారంగా మాట్లాడం వచ్చా అని ప్రశ్నించారు.

కేసీఆర్, కేటీఆర్ రాజకీయాల కోసం నల్గొండ ప్రజలు బలికావాలా..? అప్పుడు అగ్గిపెట్టే దొరకలేదని హరీష్, శ్రీకాంతాచారి ప్రాణం తీసిండు. ఇప్పుడు కేటీఆర్ బుల్డోజర్లకు అడ్డం పడుకుంటా అంటూ అమాయకులను రెచ్చగొడుతున్నరు. యువకుల ప్రాణాలు తీసేందుకు ప్రయత్నిస్తున్న కేసిఆర్ కుటుంబం రాజకీయాల పట్ల యువకులు జాగ్రత్తగా ఉండాలే అని అన్నారు. ఎస్టీపీల పేరుచెప్పి నల్గొండను ముంచాలని కేటీఆర్ చూస్తున్నారని అన్నారు. కేసిఆర్ దళిత ముఖ్యమంత్రి అబద్ధాన్ని పునికిపుచ్చుకొని, నల్గొండను మోసం చేయాలని చూస్తున్నాడని అన్నారు. మాది పనిచేసే ప్రభుత్వం రూ. 500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల కరెంట్ ఫ్రీ, రైతురుణమాఫీ చేసినం ఇంకా చేస్తామని అన్నారు. మూసీ నిర్వాసితులకు నష్టపరిహారంతోపాటు, డబుల్ బెడ్ రూం ఇండ్లు,

కేటీఆర్ వైకరి చూస్తుంటే నల్గొండ ప్రజల రక్తం మరుగు తుందని అన్నారు. రూ. 7 లక్షల కోట్లు దోచుకొని నల్గొండలో ఏ ప్రాజెక్టును పూర్తిచేయలేదు. పనికిరాని మల్లన్నసాగర్ లో మాత్రం 50 టీఎంసీల నీళ్లు నింపారాని, పోలీసులను పెట్టి నిర్వాసితులపై దౌర్జన్యం చేసిన కేసిఆర్ అల్లుడు హరీష్ ఫాంహౌజు భూమికి మాత్రం మినహాయింపు చేశారని అన్నారు. కేసిఆర్ కుటుంబానికి నల్గొండ ప్రజలంటే ఎందుకు అంత కోపం, నల్గొండ ప్రజలకు ఇంత విషం ఇచ్చి చంపండంటూఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ మాటలు తీవ్రంగా బాధించాని చెప్పిన గొల్ల జాన్ నల్గొండ ప్రజలు కేటీఆర్ మాటలతో కుమిలిపోతున్నారు.

ఇక మాకు పోరాటమే శరణ్యం, వారు వారి వైకరి మార్చు కుంటే మంచిది లేదంటే రాజకార్లను తరిమికొట్టినట్టు తరుముతం అని అన్నారు. మూసీ శుద్ధీకరణకు పూనుకున్న ముఖ్యమంత్రికి గొల్ల జాన్ ధన్యవాదాలు తెలిపారు.

## శాంతియుతంగా నిరసన తెలిపిన హిందూ సంఘాలపై

# పోలీసులు లాఠీ చార్జ్ చేయడం అమానుషం

### - మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్

**కూకట్‌పల్లి,అక్టోబర్ 20 (నమస్తే ఉదయం):** సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడికి నిరసనగా శని వారం సికింద్రాబాద్ బంద్ సందర్భంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న హిందూ సంఘాలపై పోలీసుల అత్యుత్సాహంతో జరిగిన లాఠీఛార్జ్‌లో ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్ బీజేవైఎం నాయకుడు సాయి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, వద్దేపల్లి రాజేశ్వరరావుతో కలసి సాయి నివాసానికి వెళ్లి పరామర్శించి ప్రభుత్వం యొక్క తీరును ఎండకడుతూ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాష్ రావు, హర్షణ పల్లి సూర్యారావు, బోయిన్పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గౌడ్, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కార్యకర్తను పరామర్శించిన పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్



పార్టీ సభ్యత్వం నమోదును చేపడుతున్న రాజేంద్రనగర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పొన్న మోని మల్లేష్ యాదవ్

# ప్రతి బూతుకు 200 పార్టీ సభ్యత్వ నమోదు: మల్లేష్ యాదవ్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** ప్రతి బూతుకు 200 పార్టీ సభ్యత్వ నమోదు ను చేపడుతున్నట్లు రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ పొన్న మోని మల్లేష్ యాదవ్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రేమాభిపేటలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన పార్టీ నాయకులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ... ప్రేమావతిపేట్ బూత్ నంబర్ 321, 323 బూతులలో ఇంటింటికి తిరిగి బిజెపిలో సభ్యత్వం చేయించడం జరిగిందన్నారు. ప్రతి నాయకుడు కార్యకర్త ప్రతి బూతులో 200 తగ్గకుండా సభ్యత్వం చేయించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు.అసెంబ్లీ మొత్తంలో లక్ష మంది సభ్యత్వం చేయించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు ఏడ్లకాడి రవి, యాదగిరి, పాల్గొన్నారు.

# దేశంలోనే అత్యధిక పార్టీ సభ్యత్వ నమోదు గల పార్టీ బిజెపి

## - బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజ్

### ఉప్పరపల్లిలో పార్టీ సభ్యత్వ నమోదు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** దేశంలో అత్యధిక పార్టీ సభ్యత్వ నమోదు గల పార్టీ బిజెపి అని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి పోలింగ్ బూత్ నంబర్187, సన్రైజ్ విల్లాస్‌లో బిజెపి సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ



ఉప్పర్ పల్లి సన్రైస్ కాలనీలో పార్టీ సభ్యత్వాన్ని నిర్వహిస్తున్న బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్, ప్రేమ్ రాజ్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు రాజేందర్ నగర్ డివిజన్ సభ్యత్వ నమోదు ఇన్చార్జులు సన్రైజ్ విల్లాస్ లోని ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు ఒక్క ఇంటిలోనే లలిత్ అగ్రవాల్ వాళ్ల కుటుంబ సభ్యులను 14 మందిని మెంబర్షిప్ చేయించారు డాక్టర్ ప్రేమ్ రాజు మాట్లాడుతూ... బీజేపీ పట్ల నరేంద్ర మోడీ పట్ల ఎంతోమంది ఆకర్షితులై నేడు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు .ఇండ్లలోకి పిలిచి సభ్యత్వ నమోదు చేసుకుంటున్నారని డాక్టర్ ప్రేమ్ రాజు హర్షం వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణలో 50 లక్షల సభ్యత్వం చేయాల్సిన దిశగా కార్యకర్తలు అందరూ ముందుకు రావాలని అలాగే మన రాజేంద్రనగర్ అసెంబ్లీ లో ఒక్క లక్ష 18 వేల సభ్యత్వం నమోదు చేయాలని డాక్టర్ ప్రేమ్ కోరారు .ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న వారు వై శ్రీధర్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ బొక్క బాల్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పవన్ కుమార్ కరుణాకర్ గౌడ్ కరుణాకర్ గౌడ్ ,రాజ్ పాల్ రెడ్డి, రాజు మరియు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

# వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే

## - మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

### నాయకులు,కార్యకర్తలు ధైర్యంగా ఉండండి అండగా ఉంటాము

### బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో గద్వాల్ బిఆర్ఎస్ నాయకులకు మనోధైర్యాన్ని నింపిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 20(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో రేవంత్ రెడ్డి గద్దెనెక్కిందని, వికలాంగులకు వృద్ధులకు పింఛను రెండు వేలు అదనంగా పెంచి ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఆ ఊసే లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు. వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ చర్యకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

చేపట్టిన నిరసన కార్యక్రమాలకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గద్వాల్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా మల్దకల్ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ...అమలు కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది అని అనతికాలంలోనే వాగ్దానాలు నెరవేర్చలేక రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల అగ్రాహానికి గురైందని సరైన సమయములో ప్రజలు బుద్ధి చెబుతారు అని అన్నారు.

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఓ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండాలని పార్టీ అండగా ఉంటుందని భరోసా కలిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసు హన్మంతునాయుడు , మోనేష్, తిరుమల్, తదితరులు పాల్గొన్నారు.



# జాత్ ఫస్ట్ లుక్


బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ యాక్షన్ హీరోగా నాలుగు దశాబ్దాల తన సక్సెస్ ఫుల్ కెరీర్‌లో100 మైల్ స్టోన్ మూవీకి చేరువయ్యారు. రీసెంట్ బ్లాక్ బస్టర్ గద్దర్ 2 తో అలరించిన సన్నీ డియోల్, ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్ టైనర్స్ తో అలరించే మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో చేతులు కలిపారు. ఈ కొలాబరేషన్ దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించే గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాత టిజి విశ్వప్రసాద్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కి “జాత్” అనే పవర్‌ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. సన్నీ డియోల్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ సన్నీ డియోల్‌ను పవర్ ఫుల్, ఇంటెన్స్ అవతార్‌లో ప్రజెంట్ చేసింది, ఈ యాక్షన్-ప్యాక్డ్ మూవీ నుండి ప్రేక్షకులు ఏమి ఆశించవచ్చో టోన్ ని సెట్ చేస్తుంది. సన్నీ డియోల్ తన శరీరమంతా బ్లడ్ మార్క్స్ తో మ్యాసీవ్ ఫ్యాన్‌ని పట్టుకుని ఉన్న పోస్టర్ హై-ఆక్టేన్ డ్రామా, లార్జర్-దేన్-లైఫ్ యాక్షన్ సీక్వెన్స్ లని సూచిస్తుంది.”జాత్” చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా కీలక పాత్రలలో నటిస్తున్నారు

# సమంతని వద్దన్నారా?

స్టార్ హీరోయిన్ సమంత నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీగా ఉంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ ద్వారా నవంబర్ 7 నుంచి సిటాడెల్ : హనీ బన్నీ వెబ్ సిరీస్ ప్రేక్షకులకు అందుబాటులో ఉండనుంది. గత ఏడాది కాలంగా ఈ వెబ్ సిరీస్ గురించిన చర్చ జరుగుతోంది. హాలీవుడ్ లో ప్రియాంక చోప్రా నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్ కి ఈ సిరీస్ కి ఏమైనా సంబంధం ఉందా అనే విషయంలో సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఈ మధ్య కాలంలో సిటాడెల్ గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. సమంత మీడియా ముందుకు వచ్చి పదే పదే ఇంటర్వ్యూలు ఇస్తూ చర్చనీయాంశం అవుతుంది. సిటాడెల్ లో సమంత హీరోయిన్‌గా నటించగా బాలీవుడ్ నటుడు వరుణ్ దావన్ హీరోగా నటించిన విషయం తెల్సిందే. వరుణ్ దావన్ ఈ వెబ్ సిరీస్‌లో భారీ యాక్షన్



సన్నివేశాలు చేశాడని, ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు పోటీ పడి మరీ నటించారట. తాజాగా వరుణ్ దావన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... సమంతతో నటించడం అనేది సంతోషాన్ని కలిగించింది. ఆమె చాలా ప్రతిభ ఉన్న నటి. ప్రతి విషయంలోనూ ఆమె చూపించిన శ్రద్ధ, యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె పడ్డ కష్టంకు నేను షాక్ అయ్యాను. హీరోయిన్స్ ఇంతగా కష్టపడతారా అనుకున్నాను అంటూ వరుణ్ దావన్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. ఈ వెబ్ సిరీస్‌ను కమిట్ అయిన సమయంలో దర్శకులు రాజ్ డీకే లు హీరోయిన్‌గా సమంత ను అనుకున్నాం అన్నారు. అప్పుడు నాతో చాలా మంది సమంత హీరోయిన్ గా వద్దు అన్నారు. ఆమె నటించడం వల్ల సిటాడెల్ కి ఆ స్థాయి క్రేజ్ దక్కక పోవచ్చు అన్నారు. అయినా నేను ఆమె పై నమ్మకం ఉంచాను. దర్శకులు నమ్మకంతో ఆమెను తీసుకుని సిరీస్‌ను రూపొందించారు. వారు భావించినట్లుగానే సమంత అద్భుతమైన నటనతో మెప్పించింది. అంతే కాకుండా సిరీస్ స్ట్రీమింగ్ అయిన తర్వాత ప్రతి ఒక్కరితో ప్రశంసలు దక్కించుకుంటుంది అంటూ వరుణ్ దావన్ బలంగా చెప్పుకొచ్చాడు. సమంత, వరుణ్ దావన్ మధ్య సన్నివేశాలు సిరీస్ కి ప్రధాన ఆకర్షణగా ఉంటాయట.



# ‘మట్కా’ నుంచి సాహుగా నవీన్ చంద్ర

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ ‘మట్కా’ రిలీజ్ కు రెడీగా వుంది. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్ మెంట్స్‌పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు కూడా జోరందుకున్నాయి. టీజర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ లే లే రాజా చార్ట్ బస్టర్ రెస్పాన్స్ తో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ అయ్యాయి. ఈ మూవీలో నవీన్ చంద్ర ఓ ఇంపార్టెంట్ క్యారెక్టర్ లో నటిస్తున్నారు. నవీన్ చంద్ర క్యారెక్టర్‌ని సాహుగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. నవీన్ చంద్ర స్కూటర్‌పై కూర్చుని ఇంటెన్స్‌గా చూస్తున్న పోస్టర్ క్యురియాసిటీని క్రియేట్ చేసింది. మట్కా వరుణ్ తేజ్ మోస్ట్ ఎక్స్ పెన్సివ్ మూవీ. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం జివి ప్రకాష్ కుమార్ అందించగా, ఎ కిషోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్. మట్కా నవంబర్ 14న సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

# ‘కేసీఆర్’ ట్రైలర్ చాలా బావుంది: డైరెక్టర్ సాయి రాజేష్

రాకింగ్ రాకేష్ లీడ్ రోల్ లో నటిస్తున్న మూవీ ‘కేశవ చంద్ర రమావత్’ (కెసిఆర్), గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మూవీకి గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు. అన్నన్య కృష్ణన్ కథానాయికగా నటిస్తున్నారు. రాకింగ్ రాకేష్ స్వయంగా నిర్మించిన ఈ చిత్రం లంబాడీ వర్గానికి చెందిన యువకుడి రియల్ లైఫ్ నుంచి స్ఫూర్తి పొందింది. మేకర్స్ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. కేశవ చంద్ర రమావత్ (కెసిఆర్), అతని మరదలు మధ్య చిన్ననాటి స్నేహాన్ని ప్రజెంట్ ద్వారా ట్రైలర్ ప్రారంభమైయింది,అది క్రమంగా ప్రేమగా మారుతుంది. తన షార్ట్ నేమ్ కేసీఆర్ అని సగర్వంగా చెప్పుకునే ఆ యువకుడు కేసీఆర్‌తో ఎంతో స్ఫూర్తి పొందాడు. అయితే అతను తన చిన్ననాటి మరదలుతో మ్యారేజ్ ప్రపోజల్ ని రిజెక్ట్ చేస్తాడు. కథ ఇలా సాగుతుండగా, కేసీఆర్ ఒక లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌కు బయలుదేరుతాడు. రాకింగ్ రాకేష్ మనసుని హత్తుకునే కథను రాసారు. గరుడ వేగ అంజి దర్శకుడిగా, సినిమాటోగ్రాఫర్‌గా కట్టిపడేశారు. ఈ కథనం గ్రామీణ తెలంగాణ సారాంశాన్ని, సంస్కృతిని అందంగా చూపించింది. చరణ్ అర్జున్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పవర్ ఫుల్ ఎమోషనల్ లేయర్‌ని యాడ్



చేసింది. బలగం మధు ఎడిటింగ్ బ్రిలియంట్‌గా వుంది


మహేష్ బల్లంట్ ఆర్ట్ డైరెక్టర్. గోరేటి వెంకన్న, కాసర్ల శ్యామ్‌లు సాహిత్యం అందించారు.

# అక్టోబర్ 25న ‘నరుడి బ్రతుకు నటన’

శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన చిత్రం ‘నరుడి బ్రతుకు నటన’. శృతి జయన్, ఐశ్వర్య అనిల్ కుమార్, వైవా రాఘవ్ ఇతర ప్రముఖ తారాగణంతో రాబోతోన్న ఈ చిత్రానికి రిషికేశ్వర్ యోగి దర్శకత్వం వహించారు. టిజి విశ్వ ప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డాక్టర్ సింధు రెడ్డి ఈ సినిమాను నిర్మించగా.. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవరించారు. సుధీర్ కుమార్ ప్రాజెక్ట్ హెడ్. ఈ మూవీ అక్టోబర్ 25న రాబోతోంది. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు సుధీర్ బాబు, దర్శకులు వీరశంకర్, వీజే సన్నీ, శ్రీరామ్ ఆదిత్య, వితిక షెరు వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.



అనంతరం.. సుధీర్ బాబు మాట్లాడుతూ.. ‘టీజీ విశ్వ ప్రసాద్ ని పదేళ్ల క్రితం కలిశాను. ఆయన అప్పటికి ఇంకా ఇండస్ట్రీలోకి రాలేదు. ఆయనకు సినిమాలంటే ప్యాషన్. ఈ మూవీ ట్రైలర్ చూశాను. శివ, నితిన్ ప్రసన్న ఎంతో ఇంటెన్స్‌గా నటించారు. నా చిత్రంలో ఏదైనా మంచి పాత్రలుంటే వారినే రిఫర్ చేయాలని అనుకుంటున్నాను. రిషి ఈ మూవీని అద్భుతంగా తీశాడు. నేను కృష్ణవంశీ చిత్రానికి, బాఘీ చిత్రాలకు ఆడిషన్స్ చేశాను. పెద్ద సినిమాలే కాదు.. చిన్న చిత్రాలు, మీడియం చిత్రాలే ఇండస్ట్రీని నడిపిస్తాయి. ఈ మూవీ చాలా కొత్తగా, రీఫ్రెషింగ్‌గా ఉండబోతోంద నిపిస్తోంది. అక్టోబర్ 25న ఈ చిత్రం రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయండి’ అని అన్నారు.



# ఈ లిస్ట్‌లో రాజాసాబ్

హారర్ కామెడీ అనేది ఇండియన్ సినిమాలో ఎవర్ గ్రీన్ కాన్సెప్ట్. కేవలం హారర్ అంటే ప్రేక్షకులకు బోర్ కొట్టేస్తుంది. అందుకే మన దర్శక రచయితలు హార్రర్ కు కామెడీ జోడించి, ఓవైపు కడుపుబ్బా నవ్విస్తూనే మరోవైపు థ్రిల్ ను పంచుతున్నారు. మిగతా జోనర్స్ తో పోల్చుకుంటే ఈ చిత్రాలకు పెట్టుబడి కూడా చాలా తక్కువే. క్లిక్ అయితే మాత్రం బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురుస్తుంది. నిర్మాతల జేబుల్లోకి అధిక మొత్తంలో ప్రాఫిట్స్ వచ్చి చేరుతాయి. అందుకే మన ఫిలిం మేకర్స్ ఈ జానర్ సినిమాలపై ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో మళ్ళీ హార్రర్ కామెడీ చిత్రాల ట్రెండ్ ప్రారంభమైంది. ఈ మధ్య కాలంలో అనేక సినిమాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్స్ గా నిలిచాయి. శ్రద్ధా కపూర్, రాజ్ కపూర్ రావ్ ప్రధాన పాత్రల్లో నటించిన ‘స్త్రీ 2’ సినిమాని దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తే, ఏకంగా రూ.800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. 2024లో అత్యధిక కలెక్షన్లు అందుకున్న రెండవ భారతీయ చిత్రంగా, అత్యధిక వసూళ్లు చేసిన హిందీ చిత్రంగా రికార్డ్ క్రియేట్ చేసింది. అలానే రూ.30 కోట్లతో రూపొందించిన ‘ముంజ్యా’ మూవీ.. రూ.130 కోట్లకి పైగా కలెక్షన్స్ సాధించింది. ఇదే క్రమంలో ఆడియన్స్ ను నవ్విస్తూ భయపెట్టడానికి మరికొన్ని రోజుల్లో ‘భూల్ భూలయ్యా 3’ చిత్రం వస్తోంది. ఇది బ్లాక్ బస్టర్ ‘భూల్ భూలయ్యా 2’ చిత్రానికి సీక్వెల్. ఇందులో కార్తీక్ ఆర్యన్, త్రిప్తి డిమ్రి, విద్యా బాలన్, మాధురీ దీక్షిత్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పుడు ప్రభాస్ ‘ది రాజా సాబ్’ సినిమా కూడా ఇదే జోనర్ లో రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా “ది రాజా సాబ్”. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ లో టి.జి. విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇదొక రొమాంటిక్ హారర్ కామెడీ అని మేకర్స్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ఇందులో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. వచ్చే ఏడాది సమ్మర్ లో రిలీజ్ కానున్న ఈ సినిమాపై అంచనాలు బాగానే ఉన్నాయి. ఇటీవల కాలంలో హారర్ కామెడీలు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి కాబట్టి, ఈ సినిమా కూడా బ్లాక్ బస్టర్ విజయం సాధిస్తుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. సౌత్ లో హారర్ కామెడీ సినిమాలు అనగానే ఎవరికైనా ‘ముని’ ఫ్రాంచైజీ గుర్తొస్తుంది. ఈ క్రమంలో ప్రభాస్ తో రూపొందిస్తున్న ‘ది రాజా సాబ్’ మూవీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.

# భూల్ భూలయ్యా 3 టైటిల్ ట్రాక్ లాంచ్

భూల్ భూలయ్యా 3 యొక్క ట్రైలర్ తుఫానులా వచ్చి అత్యధికంగా వీక్షించిన ట్రైలర్‌గా స్థిరపడగా, టైటిల్ ట్రాక్ విడుదలైనప్పటి నుండి మరో స్థాయిలో ముందుకు దూసుకెళ్తోంది. మిస్టర్ వరల్డ్‌వైడ్‌గా పిలువబడే పిట్‌బుల్, గ్లోబల్ పంజాబీ సంచలనం దిల్జిత్ దోసాంజ్, భూల్ భులయ్యా సిరీస్ ప్రధానమైన నీరజ్ శ్రీధర్ మరియు కార్తిక్ ఆర్యన్ యొక్క కిల్లర్ హుక్ స్టెప్స్‌తో విభిన్న సంస్కృతులు మరియు బీట్‌ల కలయికతో టైటిల్ ట్రాక్ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగింది.



టైటిల్ ట్రాక్ యొక్క ఫీవర్‌ను దేశంలోని వివిధ మూలలకు తీసుకెళ్లి, కార్తిక్ ఆర్యన్ నగర పర్యటనను ప్రారంభించాడు, అది ఇప్పుడు హైదరాబాద్‌కు చేరుకుంది. అతను ఢిల్లీలో భూల్ భూలయ్యా 3 టైటిల్ ట్రాక్‌ని ప్రారంభించాడు, అక్కడ అది సంచలనంగా మారింది. మూడు రోజుల నగర పర్యటన ఢిల్లీలో ప్రారంభమైంది, ఆ తర్వాత ఇండోర్, ఇప్పుడు హైదరాబాద్ చేరుకుంది. టీమ్ భూల్ భులయ్యా 3 మొదట డిఎస్ఆర్ స్కూల్‌ని సందర్శించారు, ఆపై ఓజీ విద్యాబాలన్‌తో కలిసి కార్తీక్ ఆర్యన్ అకా ‘రూహ్ బాబా’ ప్రో కబడ్డీ లీగ్ ప్రారంభ వేడుకల దాకా పాటలని తీసుకెళ్లారు.

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. “RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733